ప్రజాశక్తి

శుక్రవారం 28 నవంబరు, 2025 5

శ్రీకాకుళం



రేషన్ షాపుల్లో రాగులు పంపిణీ

జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ఈనెల 27 నుంచి డిసెంబరు నెల కోటాలో బియ్యం బదులుగా మూడు కిలోల వరకు రాగులు పంపిణీ చేయనున్నట్లు జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రజలకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైస్ కార్డుదారులకు డిసెంబరు కోటాలో బియ్యానికి బదులుగా మూడు కిలోల వరకు ఉచితంగా రాగులు అందించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాగులు పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లాలోని ప్రతి రేషన్ దుకాణంలో రాగుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయని, లబ్ధిదారులు తమ రేషన్ కార్డులతో సంబంధిత దుకాణాలకు వెళ్లి తీసుకోవాలని కోరారు.

- ధాన్యం సేకరణలో సాంకేతిక సమస్యలు
- బ్యాంకు గ్యారంటీల క్లియరెన్స్‌లో జాప్యం
- నేటికీ తెరుచుకోని 182 కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటివరకు 9,978 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరణ

మందకొడిగా కొనుగోలు



కొనుగోలు చేయకపోవడంతో బూర్జ మండలం నీలంపేటలో రోడ్డుపై ఉంచిన ధాన్యం బస్తాలు

జిల్లాలో ధాన్యం కొనుగోలు మందకొడిగా సాగుతున్నాయి. రైతులు ధాన్యం అమ్మేందుకు సిద్ధపడుతున్నా కొనుగోలు జరగడం లేదు. ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయాన్ని అరికట్టేందుకు తీసుకొచ్చిన కొత్త సాంకేతికత కొనుగోలు ప్రక్రియను క్లిష్టతరం చేశాయి. ముఖ్యంగా ధాన్యం మర ఆడించేందుకు మిల్లర్లు ప్రభుత్వానికి ఇచ్చే బ్యాంకు గ్యారంటీ(బిజి)లను ప్రభుత్వం ఈ సారి ఈ-బిజిలుగా మార్చింది. దీంతో బ్యాంకుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావడానికి చాలా సమయం పడుతున్నట్లు తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాల్లోని జియో కో-ఆర్డినేట్స్‌కూ, జిపిఎస్ (గ్లోబల్ పొజిషన్ సిస్టమ్)కు మ్యాచ్ కాకపోవడం కొనుగోలుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతోందని తెలుస్తోంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

2025 ఖరీఫ్‌లో 3.80 లక్షల ఎకరాల్లో వరి సాగయినట్లు వ్యవసాయశాఖ అధికారులు పౌర సరఫరాల సంస్థ అధికారులకు వివరాలు అందించారు. జిల్లాలో ఈ సంవత్సరం 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అందులో 6.50 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగిలిన ధాన్యాన్ని ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకోవడానికి రైతులకు అవసరమైన సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. కొనుగోలు చేయాల్సిన ధాన్యం కోసం జిల్లా వ్యాప్తంగా 406 కేంద్రాలను అధికారులు గుర్తించారు. ఎప్పటిమాదిరిగానే రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లు, డిసిఎంఎస్‌లు, వెలుగు, జిఇసి (గవర్నమెంట్ ఎంప్లాయీస్ సెంటర్స్)ల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) కోసం 250 మిల్లులకు పంపనున్నారు. తొలుత 264 మంది మిల్లర్లు ధాన్యం సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)కు ముందుకొచ్చినా 14 మంది మిల్లర్లు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని 250 మిల్లులకే అప్పగించనున్నారు.

కొత్త రకం సాంకేతిక సమస్యలు

పంటల ఈ-క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ క్రాప్ వివరాలను ఆయా రైతు సేవా కేంద్రాలకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు పంపారు. దీని ఆధారంగానే కొనుగోలు కేంద్ర సిబ్బంది రైతుల నుంచి ధాన్యం తీసుకుంటున్నారు. అయితే కొనుగోలు కేంద్రాల వెబ్‌సైట్‌లో ఉన్న జియో-కోర్డినేట్స్‌కు, మిల్లులకు ధాన్యం తీసుకువెళ్లే వాహనాలకు ఏర్పాటు చేసే జిపిఎస్ (గ్లోబల్ పొజిషన్ సిస్టమ్)కు మ్యాచ్ కాకపోవడంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అదీ కూడా కస్టోడియన్ అధికారులుగా నియమించిన స్థానిక విఆర్‌ఒలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియలో జాప్యం చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కొన్ని విఆర్‌ఒలు పూర్తిగా పరిశీలించకుండానే తమ లాగిన్‌లోకి వచ్చిన వివరాలకు పంపేయడంతో ధాన్యం కొనుగోలు అసంపూర్తిగా జరిగినట్లు పౌర సరఫరాల సంస్థ అధికారుల వెబ్‌సైట్‌లో చూపుతోంది. దీనిని సర్దుబాటు చేయడానికే అధికారులకు సమయం అంతా సరిపోతున్నట్లుగా తెలుస్తోంది.

బ్యాంకు గ్యారంటీల సమర్పణలో జాప్యం

రైతుల నుంచి సేకరించిన ధాన్యం విలువకు కొంత మొత్తం మేర బ్యాంకు గ్యారంటీ (బిజి) ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటివరకు అది మాన్యువల్‌గా జరిగింది. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి ప్రభుత్వం దానిని ఈ-బిజిగా మార్చింది. దీంతో బ్యాంకు గ్యారంటీల ప్రక్రియ చాలా ఆలస్యంగా సాగుతోంది. అదీ కూడా ఇచ్చిన ధాన్యం విలువలో బ్యాంకు గ్యారంటీ మార్జిన్ విషయంలోనూ స్పష్టత లేకపోవడంతో ఈ ప్రక్రియ చాలా ఆలస్యంగా సాగింది. కొన్ని బ్యాంకులు ఐదు శాతం, మరికొన్ని బ్యాంకులు పది శాతం మార్జిన్ మేర సొమ్ము తీసుకుని బ్యాంకు క్లియరెన్స్ ఇచ్చాయి.

ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేలా చర్యలు



జిల్లాలో ధాన్యం కొనుగోలు సాఫీగా సాగేలా చర్యలు చేపడుతున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఈ నెలాఖరు నాటికి అధిగమిస్తాం. జిల్లాలో ఉన్న 250 మిల్లులకు బ్యాంకు గ్యారంటీ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉన్నందున బ్యాంకుల్లో కొంత ఆలస్యమవుతోంది. ఇదీ కూడా ఒకట్రెండు రోజుల్లో పరిష్కారమవుతుంది.

- వేణుగోపాల్,
జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పక్కాగా ఓటర్ల జాబితా కూర్పు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఓటర్లు జాబితాలు పక్కాగా, పారదర్శికంగా సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఎన్నికల ప్రాతినిధ్య నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో గురువారం సమీక్షించారు. అందులో భాగంగా జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన రిపోర్టు పరిశీలించారు. ఇచ్ఛాపురం 29.04 శాతం, పలాస 27.17 శాతం, టెక్కలి 36.85 శాతం, పాతపట్నం 33.72 శాతం, శ్రీకాకుళం 34.61 శాతం, ఆమదాలవలస 41.55 శాతం, ఎచ్చెర్ల 34.47 శాతం, నరసన్నపేట 41.14 శాతం పూర్తయిందని నివేదిక ద్వారా అధికారులు తెలిపారు. అలాగే ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి గురువారం వరకు ఫారం-6, ఫారం-7, ఫారం-8కి సంబంధించిన పూర్తికాని వాటి వివరాలు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత ఎన్నికల కంట్రోల్, బూత్ స్థాయి సిబ్బందికి ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించటం, డబల్ ఎంట్రీ లేకుండా తీర్చి దిద్దటం, మృతి చెందిన వ్యక్తులు ఓట్లు తొలగింపు వంటికి ప్రాధాన్యత నిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎన్నికల ప్రక్రియలో భాగమైన ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తుపానుపై అప్రమత్తం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో రానున్న నాలుగు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో యంత్రాంగం అప్రమ త్తంగా ఉండాలని కలెక్టర స్వప్నిల్ దినకర్ పుడ్కర్ అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ గురువారం ధాన్యం సేకరణపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, సంక్షేమ వసతిగృహాలు, ఆర్‌జిజిఎస్, ప్రజా సానుకూల దృక్పథం, తదితర అంశాలపై కలెక్టర్లతో ఎపి సచివాలయం నుంచి సమీక్షించారు. కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వర్షాల వల్ల ధాన్యం తడవకుండా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. ఒకవేళ తడిసిన ధాన్యంపై ఫిర్యాదులు వస్తే, ఆ కారణంగా రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తే, సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, గన్నీ బ్యాగులు, టార్పాలిన్ల కొరత లేకుండా చూడాలని సూచించారు. జిల్లాలో గోనె సంచుల కొరత లేదని సిఎస్‌కు తెలియజేశారు. జిల్లాలో వసతిగృహాల్లో నిర్మిస్తున్న మరుగుదొడ్ల వివరాలను గురించి వివరించారు. అన్న క్యాంటీన్లు, పారిశుధ్య నిర్వహణ అంశాలపై మాట్లాడారు. జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సహా పలు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మర్రిపాడు-సిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రజా దర్బార్‌ను గురువారం నిర్వహించారు. పాతపట్నం నియోజకవర్గం రాజకీయ చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యే ఈ కార్యక్రమం నిర్వహించడంపై అన్ని తరగతుల ప్రజలు పార్టీలకతీతంగా, పార్టీ రహితంగా 'ప్రజా దర్బార్' నిర్వహించడంపై హర్షాతిరేఖలు వచ్చాయి. గత ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలు గాలికి విడిచిపెట్టడంతో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ఈ తరుణంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే కృషిపై పలువురు అభినందించారు. ముఖ్యంగా మండలం నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో భూ వివాదాలు, రెవెన్యూలతో పాటు రహదారుల సమస్యలు, విద్యుత్ కోతలు, తాగునీటి సమస్యలు, ప్రధాన సమస్యలే ఆయన దృష్టికి వచ్చాయి. దీనితోపాటు రేషన్ కార్డులు కావాలని పింఛనులు కావాలని, ఇళ్ల స్థలాలు కావాలని, గృహ నిర్మాణాలు చేపట్టాలని, వృద్ధులు వికలాంగులు, వితంతువులు వ్యక్తిగత ఫిర్యాదులూ వచ్చాయి. గత పాలనలో పాలకులు, పాలనపై దృష్టి సాధించక సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోవడంతో ప్రభుత్వం మారడంతో స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి అనేక సమస్యలు సామాజిక సాంఘిక సమస్యలపై స్పందించి ఫిర్యాదులు ఇవ్వడం జరిగింది. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు ఐదు మండలాల నుంచి ప్రజా దర్బార్‌కు హాజరై ఆయా వినతులు అందుకున్నారు. ప్రజా దర్బార్‌లో రెవెన్యూ, విద్యుత్‌శాఖ, ఆరోగ్యశాఖ, ఐటిడిఎ, ఐసిడిఎస్, మండల పరిషత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన శాసనసభ అంచనాల కమిటీ

శ్రీకాకుళం సిటీ: జిల్లాకు చేరుకున్న ఆంధ్రప్రదేశ్ శాసన సభ అంచనాల కమిటీకి జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ శాసన సభ అంచనాల కమిటీ-2024-25 జిల్లాలో పర్యటనలో భాగంగా గురువారం జిల్లాకు చేరుకుంది. చేరుకున్న వారిలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు (శాసన సభ్యులు), డాక్టర్ వి.వి.సూర్యనారాయణ రాజు పెనుమత్స (శాసన మండలి సభ్యులు), వరుదు కళ్యాణి (శాసన మండలి సభ్యులు) ఉన్నారు. కమిటీతో పాటు రాష్ట్ర శాసన సభ డిప్యూటీ సెక్రటరీ కె.రాజాకుమార్, అసిస్టెంట్ సెక్రటరీ వి.భిక్షం, సెక్షన్ ఆఫీసర్ టి.చిరంజీవి ఉన్నారు. స్వాగతం పలికిన వారిలో ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయిప్రత్యూష, డిఎస్‌పి వివేకానంద, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పిడి సుధాకర్, తహాశీల్దార్లు గణపతిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. కమిటీ ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం నుంచి బయలు దేరి అరసవల్లి సూర్య నారాయణస్వామి వారిని దర్శించుకున్న అనంతరం శ్రీకూర్మథం స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు అధికారులతో నిర్వహించనున్న సమీక్షా సమావేశంలో పాల్గొంటారు.



చేరుకున్న అంచనాల కమిటీతో జిల్లా అధికారులు

భార్యని చంపిన భర్తకు జీవిత ఖైదు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

భార్యను హతమార్చిన కేసులో ముద్దాయి జీరు వెంకట రమణకి శ్రీకాకుళం కోర్టు జీవిత ఖైదు శిక్షను గురువారం ఖరారు చేసిందని ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి తెలిపారు. కర్లపు నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు... ముద్దాయి తన భార్య జీరు రమణమ్మ (24) వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందన అనుమానంతో ఏడాది పాటు ఆమె తన కన్నవారి ఇంట్లో ఉండేదన్నారు. అనంతరం ముద్దాయి తండ్రి మరణంతో అంత్యక్రియల నిమిత్తం ఇంటికి ఇంటికి వచ్చిందని చెప్పారు. 2018 మార్చి 14న బాణంలోని ముద్దాయి ఇంటి వద్ద భాభార్యభర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుందన్నారు. నీతో ఉండనని ఆమె స్పష్టంగా చెప్పిందన్నారు. దీంతో ఆగ్రహంతో ముద్దాయి పదునైన కత్తితో ఆమె మెడపై విచక్షణారహితంగా దాడి చేయగా, ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని అన్నారు. ఆమె బంధువుల ఫిర్యాదు మేఉకు అప్పటి జె.ఆర్.పురం సిఐ వై.రామకృష్ణ కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారని చెప్పారు. తరువాత ముద్దాయి బెయిల్‌పై విడుదలై కొన్ని వాయిదాలకు హాజరయ్యారని అన్నారు. అనంతరం గత ఐదేళ్లుగా కోర్టుకు హాజరుకాకపోవడంతో ముద్దాయిపై నాన్ బెయిల్‌బుల్ వారంట్ జారీ చేసినట్లు వివరించారు. ప్రత్యేక టీం ఏర్పాటు చేసి ముద్దాయి ఉన్నచోట విచారణ చేపట్టి గుంటూరు పట్టణంలో అతడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఆ తరువాత కోర్టులో హాజరుపరచగా కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించి, తదుపరి కోర్టు కేసును త్వరితగతిన విచారణ కోసం ట్రయల్ షెడ్యూల్‌ను ప్రకటించిందని అన్నారు. ఈ నేపథ్యంలో కేసులోని సాక్షులను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఆమదాలవలస సర్కిల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పొందూరు పోలీసుల సమన్వయం, సాక్షుల పక్కా హాజరుపరిచారని చెప్పారు. కోర్టు ట్రయల్‌ను వేగవంతంగా పూర్తి చేసి తీర్పును వెల్లడించిందని అన్నారు. ఆయనకు జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ రోర్టు తీర్పునిచ్చిందని అన్నారు. జిల్లాలో తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, ఇలాంటి కేసుల్లో చట్టపరమైన చర్యలను వేగవంతం చేసేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నేర నియంత్రణ, తప్పు చేసిన వారికి శిక్ష లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు.



మందస : మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థే లక్ష్యం

మందస : ప్రజలకు నాణ్యమైన పోలీసు వ్యవస్థను ఏర్పరిచి పోలీస్ సేవలను అందించాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి సూచించారు. మందస పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలో భాగంగా గురువారం రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి క్రైమ్ రేటును తగ్గించాలన్నారు. మండలంలో గంజాయి, డ్రగ్స్ నివారణపైన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుకు ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఐ తిరుపతిరావు, ఎస్‌ఐ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకపోతే అభివృద్ధి ఎలా?

ఇంజినీరింగ్ అధికారుల తీరుపై కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోతే పనులు ముందుకు ఎలా సాగుతాయని ఇంజినీరింగ్ అధికారులపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ శ్రీనివాస్ ఈ వ్యవహారంపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ మందిరంలో చైర్మన్ గిరిబాబు అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ కమిషనర్ వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని అన్నారు. దానికి కౌన్సిలర్లు సహకరిస్తామన్నారు. గత కమిషనర్ నడిపేన రామారావు ఎంతో బాధ్యతగా అభివృద్ధి కృషి చేశారని అన్నారు. అదే తరహాలో కమిషనర్ శ్రీనివాస్ పనిచేయాలని కోరారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం తరువాత పలాస-కాశీబుగ్గ ఎంతో ప్రాముఖ్యత కలిగిన మున్సిపాలిటీ అని అన్నారు. నూతన కమిషనర్‌గా తన మార్కుతో అభివృద్ధి చేసి చూపించాలన్నారు. కౌన్సిలర్ దుర్గా శంకర్‌పండా మాట్లాడుతూ గత పలు సమావేశాల్లో ఎన్నో సమస్యలు అధికారులు దృష్టిలో పెట్టినా... ఇంత వరకు సమాధానం చెప్పడం లేదని అన్నారు. అభివృద్ధి పనులు జాప్యం జరుగుతుంటే ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. పారిశుధ్యం, కాశీబుగ్గ శ్మశాన వాటిక అత్యంత దరిద్రంగా ఉన్నాయని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. అక్కుపల్లి రోడ్డు ప్రారంభంలో మాజీ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు అక్కడ కనిపించడం లేదని, అవి ఎక్కడ ఉన్నాయని, రోడ్డుకు అడ్డం అయితే పక్కన అయినా పెట్టి ప్రజా ప్రతినిధులను గౌరవించవలసిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. చైర్మన్ స్పందించి శిలాఫలకాలను యథాస్థితిలో ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులను గౌరవించాలని అధికారులకు సూచించారు. కౌన్సిలర్ శర్వాన గీత మాట్లాడుతూ పదో వార్డులో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలోమున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫొటోను చూపిస్తున్న కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా
(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



భీమారావు, సుశాంత జెన్న మృతదేహాలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని పాత జాతీయ రహదారి గరుడఖండి సమీపంలో గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడ్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించగా, శ్రీకాకుళం రిమ్స్ రిఫర్ చేశారు. ఆయన పరిస్థితి ఆందోళనకంగా ఉంది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పాతపట్నం మండలం సరాలికు చెందిన తలగాపు భీమారావు (25), మండలంలోని వీరభద్రాపురానికి చెందిన తలగాపు వేణు ఒకే వాహనంపై పలాస వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ సంఘటనలో భీమారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎదురుగా వస్తున్న వాహనం నడిపిస్తున్న ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి సమితి డెరబాకు చెందిన సుసాంత్ జెన్నా (26) కూడా అక్కడికక్కడే మృతి చెందాడు. వేణుకు స్థానికులు అంబులెన్స్ వాహనంలో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఢీకొన్న వాహనాలు రెండు కూడా మితిమీరిన వేగంతో వచ్చి ఢీకొన్నట్లు పోలీసులు భావిసంన్నారు. భీమారావు రోడ్డుపై పడి మృతి చెందగా, సుశాంత్ జెన్నా సమీప పొదల్లో పడి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదం సంభవించిన గంటవరకూ వారి వివరాలు ఏవి లభించలేదు. వారి సెల్ ఫోన్ల ఆధారంగా వివరాలు గుర్తించారు. అనంతరం వారి బంధలవులకు మృతి సమాచారాన్ని అందించారు. భీమారావు, వేణు ఇద్దరూ బంధువులు. వీరభద్రాపురంలో నిర్వహించిన ఓ వేడుకకు హాజరైనట్లు గ్రామస్తులు తెలిపారు. వీరు కాశీబుగ్గలో సొంతపనిపై ద్విచక్రవాహనంపై వచ్చినట్లు వారు చెబుతున్నారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. వేణుకు కాలు, చేయి విరిగిపోయి అపస్మారకస్థితిలో ఉన్నాడు. ఆయనను శ్రీకాకుళం రిమ్స్ రిఫర్ చేశారు. సంఘటన స్థలానికి కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ, ఎస్‌ఐ నర్సింహమూర్తి చేరుకొని ఇరువురి శవాలు స్వాధీనం చేసుకొని పలాస ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టంకు తరలించారు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిఎంపిలు ఆస్పత్రులు నడపరాదు

డిఎంహెచ్‌ఒ కె.అనిత

శ్రీకాకుళం సిటీ: పిఎంపిలు ఆస్పత్రులను నడుపరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత స్పష్టం చేశారు. డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో పిఎంపి అసోసియేషన్లతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టిషనర్లు ఎవ్వరూ ఇంజిక్షన్లు చేయరాదన్నారు. ఎవరైనా జ్వరం, దగ్గు, జలుబులతో వస్తే, చిన్న చిన్న వైద్యం మాత్రమే చేయాలని సూచించారు. సెలైన్స్ పెట్టడం, కుట్లు వేయడం వంటి వైద్యం చేయరాదని తెలిపారు. అలాగే ఇన్ పేషంట్ రోగులను ఉంచరాదని హెచ్చరించారు. ఏ రోగికైనా వారు వైద్యం చేస్తుండగా ప్రమాద పరిస్థితి ఏర్పడినట్లయితే సంబంధిత పిఎంపిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు సైతం ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. క్వాలిఫైడ్ వైద్యులను సప్రదించాలని సూచించారు. సమావేశంలో పిఎంపి అసోసియేషన్ అధ్యక్షులు వి.శిమ్మన్న, సెక్రటరీ ఎన్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ అనిత

బాధితులకు త్వరితగతిన నష్టపరిహారం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మోటారు ప్రమాదం కేసులో బాధితులకు నష్టపరిహారం త్వరితగతిన చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, స్థానిక న్యాయ సేవా సదన్ కోర్టు ఆవరణంలో ఆయన గురువారం పోలీసు అధికారులతో మోటారు యాక్సిడెంట్ కేసుల్లోని బాధితుల న్యాయంపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితుల క్లెయిమ్‌లను త్వరితగతిన చెల్లించేందుకు ఉన్న మార్గాలను గురించి విశ్లేషించి సమీక్షించారు. ప్రమాదం సంభవిన ప్రదేశంలో బాధితుడికి సహాయం చేయకపోవడం పోగా, నిర్లక్ష్యంగా వదిలి వెళ్లిపోవడం సరికాదని అన్నారు. అలాంటి వారిని విడవరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఆర్‌డిఒ కార్యాలయం నుంచి ఆర్. ఈశ్వరమ్మ, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ డిటి డి.ఎం.నాగేంద్రప్రసాద్, ట్రాఫిక్ పోలీస్ సిఐ వి.రామారావు, సిఆర్‌బి ఎఎస్‌ఐ పి.ధర్మారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు, కార్మికులు

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

శ్రీరాజ్యలక్ష్మి పిఎస్‌సిసి పవర్ ఇన్సార్ ఫోల్స్ పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయడంతో పాటు తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, జిల్లా కమిటీ సభ్యులు సవలాపురపు కృష్ణవేణి అన్నారు. మండలంలోని రాపాక సమీపంలో గల శ్రీరాజ్యలక్ష్మి పిఎస్‌సిసి పవర్ ఇన్సార్ పరిశ్రమ వద్ద ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో గురువారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాజ్యలక్ష్మి పోల్స్ యాజమాన్యం కార్మికుల హక్కులు కాలరాస్తూ కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్‌ఐ సక్రమంగా కట్టకుండా, కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికులను నిత్యం పలు రకాలుగా వేధిస్తున్నారని, సీనియర్ డ్రైవర్‌ను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధాంతరంగా తొలగించడం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. యాజమాన్యం తీరుకు నిరసనగా డిసెంబర్ 2న శ్రీకాకుళంలోని డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు పక్కి జగత్, పి.విజయరాజు, కరణం నీలంనాయుడు, చిన్న ప్రకాష్, గేదెల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రణస్థలం మండల కేంద్రం జె.ఆర్.పురంలో జాతీయ రహదారికి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ లేని విధంగా 800 మీటర్లు రోడ్డు ఇరువైపులా ఓపెన్‌గా ఉండే విధంగా నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రాధాకృష్ణ, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట బానోజీ నాయుడు, కూటమి నారాయణ శెట్టి శ్రీనివాసరావు, పిసిని హరికృష్ణ, రౌతు శ్రీనివాసరావు, ముక్కు ఆది నారాయణ, దన్నాన మహేష్, వెలిచేటి కామేశ్వరరావు, తిప్పాన బాబురావు, అప్పలనాయుడు, సుంకర రమణ, పిన్నింటి అన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.


గ్రిగ్స్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- పొందూరు

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చునని ఎంఇఒ -1 ఎం.వాగ్దేవి అన్నారు. మండలంలోని పిల్లలవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండలస్థాయి గ్రిగ్స్ పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్ పోటీలకు సంబంధించి మండలంలోని 11 పాఠశాలలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ బాలుర విభాగంలో కబడ్డీలో మహాత్మ జ్యోతిబా పూలే, రన్నర్స్ జిహెచ్ఎస్ పొందూరు, వాలీబాల్ విన్నర్స్ లోలుగు, రన్నర్స్ పొందూరు, ఖోఖో విన్నర్స్ మహాత్మ జ్యోతిబా పూలే, రన్నర్స్ తాడివలస, బ్యాడ్మింటన్ విన్నర్స్ పొందూరు, రన్నర్స్ కింతలి జెడ్‌పి హెచ్ఎస్‌లు నిలిచాయి. అలాగే జూనియర్స్ బాలుర విభాగంలో కబడ్డీలో విన్నర్స్ మహాత్మ జ్యోతిబా పూలే, రన్నర్స్ ఎపి మోడల్ స్కూల్, ఖోఖో విన్నర్స్ మహాత్మజ్యోతిబా పూలే, రన్నర్స్ లోలుగు, వాలీబాల్ విన్నర్స్ పిల్లలవలస, రన్నర్స్ మహాత్మ జ్యోతిభాపూలే, బ్యాడ్మింటన్ విన్నర్స్ పొందూరు, రన్నర్స్ కింతలి, తృతీయ స్థానం రాపాక జెడ్‌పిహెచ్ఎస్‌లు నిలిచాయి. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు, హెచ్ఎం బస్వా గొల్లవాడు, ఎంఎస్ఒ ఉదయ్‌కుమార్, గ్రామపెద్దలు గురుగుబెల్లి శ్రీరామమూర్తి, శ్రీరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంటశాల ప్రారంభం

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వంటశాల నూతన నిర్మానానికి రూ.50 గుడ్ల ఆనందరావు, హరిభారతి జ్ఞాపకార్థంగా తన కుమారుడు గుడ్ల శ్రీధర్, ప్రిన్సిపాల్ ధనుంజయరావుకు అందజేశారు. దీంతో వంటశాలను నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఈ వంటశాలను గురువారం కళాశాల ప్రిన్సిపాల్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎద్దు గోపాలదాస్‌నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో గుడ్ల అశోక్ కుమార్, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

ప్రజాశక్తి- ఆమదాలవలస


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పట్టణ పారిశుధ్యంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని, లోపాలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కూన రవికుమార్ హెచ్చరించారు. గురువారం ఉదయం 5:30 గంటలకు స్కూటీపై సుడిగాలి పర్యటన చేస్తూ పట్టణ ప్రజలను 'హలో... గుడ్ మార్నింగ్' అంటూ పలకరించారు. ఈ సందర్భంగా 16, 17, 14, 2, 12, 13వ వార్డులతో పాటు కంద్రపేట, శివన్నారాయణ క్వార్టర్స్, పూజారిపేట, ఐజె నాయుడు కాలనీ, కృష్ణాపురం పట్టణ ప్రధాన రహదారి ప్రాంతాలను సందర్శించారు. ఈ పర్యటనలో ప్రజలు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగానే వెంటనే పరిష్కరించాలని కమిషనర్ తమ్మినేని రవిని ఆదేశాలు జారీ చేశారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ దుకాణదారులు తమ దుకాణాల ముందు పెద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి చెత్తను రోడ్లపై వేయకుండా నిల్వ చేయాలని సూచించారు. 60 వేల జనాభా ఉన్న మున్సిపాలిటీలో కేవలం 68 మంది పారిశుధ్య కార్మికులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, ప్రజలు కూడా అధికారులు, కార్మికులకు సహకరించాలన్నారు. లక్ష్మీనారాయణ ఆలయం వెనుక రహదారిపై మెట్లు నిర్మించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, రహదారులు ఆక్రమిస్తే భవిష్యత్‌లో తీవ్ర సమస్యలు వస్తాయని, డ్రైనేజీ పనుల కోసం మెట్లు తొలగించక తప్పదని గృహ యజమానులు సహకరించాలన్నారు. జూనియర్ కళాశాల ముందు అక్రమ దుకాణాలను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని, కోర్టు ఎదుట ఉన్న అక్రమ దుకాణాలను వెంటనే తొలగించాలని కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. లక్ష్మీనగర్ ప్రాంతంలో నిర్మించిన సిసి రహదారి నిబంధనలకు విరుద్ధంగా 8 అడుగుల విస్తీర్ణంలో నిర్మించడంపై గుత్తేదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో హనుమంతు నాగభూషణరావు, పి.వి.వి.కె రాజు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కూన అప్పల నాయుడు, టిడిపి నాయకులు నాగళ్ల మురళీధర్ యాదవ్, కూన రమేష్ నాగు, రాము, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల కోసం మాట్లాడే అర్హత టిడిపికి లేదు

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస


మాట్లాడుతున్న రవికుమార్

ప్రస్తుతం టిడిపి నిర్వహిస్తున్న 'రైతన్న మీ కోసం' కార్యక్రమం బూటకం తప్ప మరేదీ కాదని అది పూర్తిగా రైతులను మోసం చేసే ప్రయత్నమని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతాంగం తీవ్రంగా అన్యాయానికి గురైందన్నారు. ఏడాదికి రూ.20 వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పి రెండు సీజన్లకు రావాల్సిన రూ.40 వేలు స్థానంలో కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చి రైతులను అవమానించారని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు ప్రతి ఎకరాకూ ఉచితంగా పంట భీమా కల్పించి ప్రకృతి విపత్తుల వలన జరిగిన పంట నష్టాన్ని పూర్తిగా రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసి రైతులకు శఠగోపం పెట్టిందని మండిపడ్డారు. గత సీజన్‌లో ఒక యూరియా బస్తా కోసం రైతులు పడిన ఇబ్బందులు మరచిపోలేనివని, యూరియా కోసం రైతు ఇల్లు మీద పచ్చ జెండా కట్టమనడం ఎంతటి దారుణమో ప్రజలంతా ఆలోచించాలనిన్నారు. వ్యవసాయం 'దండగ' అన్న చంద్రబాబు ఇప్పుడు రైతన్న మీకోసం అంటూ కార్యక్రమాలు చేయడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలుపై రైతుల్లో భయం నెలకొందని ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే దళారులు లేకుండా ఎటువంటి వివక్ష లేకుండా రైతులకు సరైన కనీస మద్దతు ధర ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, సరుబుజ్జిలి జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైసిపి సరుబుజ్జిలి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

మండలస్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి- బూర్జ


నారాయణరావు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు మండలస్థాయి ఆటల పోటీలను (గ్రిగ్స్ మీట్) నిర్వహించనున్నట్లు మండల స్పోర్ట్స్ అధికారి నారాయణరావు తెలిపారు. మండలంలోని 11 పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు చదువుతున్న బాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాట్మెంట్ వంటి క్రీడల్లో విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు మండలంలోని పిఇటిల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- బూర్జ


అప్పన్న, ఎఇ

మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు విద్యుత్ శాఖ ఎఇ అప్పన్న తెలిపారు. మండలంలోని కొల్లివలస 33 కెవి, 11 కెవి ఎస్ఎస్ నందు మరమ్మతులు కారణంగా కొత్తగా బ్రేకర్ కనెక్షన్ పెట్టడం జరుగుతుందన్నారు. ఈ కారణంగా కొల్లివలస సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న కొల్లివలస, గుత్తావల్లి, ఉప్పినవలస, నారాయణపురం, కొరగాం, తోటవాడ తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్టు తెలిపారు.

డిప్యూటీ ఎంపిడిఒగా అప్పన్న

ప్రజాశక్తి- పొందూరు


అప్పన్న, డిప్యూటీ ఎంపిడిఒ

మండలం డిప్యూటీ ఎంపిడిఒగా, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారిగా దుంపల అప్పన్నను నియమిస్తూ గురువారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన శ్రీకాకుళం ఇజిపిఐయు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగున్నతిపై ఇక్కడకు నియామకం చేశారు.


ప్రారంభిస్తున్న రామారావు

క్రీడలతో మంచి భవిష్యత్

ప్రజాశక్తి- కంచిలి

పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించడం ద్వారా బంగారు భవిష్యత్‌ను సాధించుకోవచ్చని టిడిపి మండల అధ్యక్షుడు మాదిన రామారావు అన్నారు. మండలంలోని పెద్దశ్రీరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి గ్రిగ్స్ ఆటల పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 12 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థి దశలో చదువుతోపాటు ఆటల్లో ఆసక్తి కనబరచాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించి మంచి భవిష్యత్‌ను సాధించుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్. శివరాంప్రసాద్, చిట్టిబాబు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి సురేష్‌కుమార్



శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో డివిఐఒ సురేష్‌కుమార్

ఆమదాలవలస: జిల్లా వ్యాప్తంగా వృత్తివిద్య కోర్సుల వారికి నిర్వహిస్తున్న ఆన్ ది జాబ్ ట్రైనింగ్ (ఒజెటి)ను జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి రేగ సురేష్ కుమార్ జిల్లా కమిటీ సభ్యులతో కలిసి గురువారం పరిశీలించారు. ఒకేరోజు మూడు కళాశాలలకు చెందిన శిక్షణను తనిఖీ చేశారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎ అండ్ టి విద్యార్థులు జిల్లా ఆదాయపు పన్ను కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాన్ని సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. జలుమూరు, శ్రీకాకుళం బాలురు కళాశాలలకు చెందిన ఎం అండ్ ఎటి గ్రూప్ విద్యార్థులు జాతీయ రహదారిలోని రంగా ఆటోమొబైల్స్‌లో పొందుతున్న శిక్షణను పరిశీలించారు. ఓజెటిలో విద్యార్థులు క్షేత్రస్థాయి శిక్షణను వినియోగించుకొని నైపుణ్యాలు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. డివిఐఒతో పాటు జిల్లా కమిటీ సభ్యులు బొమ్మలాట శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల, దుగ్గివలస రాంప్రసాద్, ఎంఎఎస్ శ్రీనివాస్, జలుమూరు ప్రిన్సిపాల్ సారిక, గణపతి వెంకటేశ్వరరావు, ప్రాంతీయ కమిటీ సభ్యులు ఎం నిరంజన్, సీనియర్ అధ్యాపకులు శ్రీనగేష్, ధనుంజయ్ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం డిసెంబరు 31 వరకూ జిల్లాలో కొనసాగుతుందని తెలిపారు.


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

క్రీడలకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- నరసన్నపేట

క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అంతర పాఠశాలల గ్రిగ్స్ ఆటల పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటలు ఆడటంతో ఆరోగ్యం కలుగుతుందని, ముఖ్యంగా ఆటలతో స్నేహబంధాలు మెరుగుపడతాయని పోటీతత్వం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు చాలా అవసరమని, క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా విద్యార్థులు రాణించాలని అన్నారు. ఆ దిశగా కృషి చేయాలని వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో పొందర కూరాకుల కార్పొరేషన్ ఛైర్మన్ దామోదర నరసింహులు, రాష్ట్ర రైతు కార్యదర్శి జల్లు చంద్రమౌళి, టిడిపి మండల అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ ఛైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, పిఎసిఎస్ ఛైర్మన్ ఇసా అప్పారావు, జల్లు చంద్రమౌళి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గొద్దు చిట్టిబాబు, ఎంఇఒ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌జిఒ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి- పలాస


ఎన్నికైన ఎన్‌జిఒ సంఘ నాయకులు

కాశీబుగ్గ హైస్కూల్ దరిలో అసోసియేషన్ భవనంలో గురువారం నిర్వహించిన ఎపిఎన్‌జిఒ మండల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. డిప్యూటీ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ కమిషనర్ రాయి వేణుగోపాల్, శ్రీకాకుళం టౌన్ అధ్యక్షులు బొత్స శ్రీనివాసరావు కో-ఆపరేటివ్ అధికారి కె.రవికుమార్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం ఆధ్వర్యాన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలాస యూనిట్ అధ్యక్షునిగా బోనెల గోపాల్, కార్యదర్శిగా బి.ఉపేందరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ పట్నాయక్, ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ట్రెజరర్ ఉదయ్ శంకర్ పాత్రో, ఉపాధ్యక్షులు సద్గుణబాబు, కొర్ల కళ్యాణ్‌బాబు, వి.త్రివేణి, యు.లత, జాయింట్ సెక్రెటరీ బాలు, ప్రగడగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సాయిరాం మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంక్షేమ పథకాలు ప్రభుత్వం ఉద్దేశించే ప్రతి పనిని చేస్తూ వారిధిగా ఉంటున్నారు. ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగస్తులు అందరూ సంఘటితంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చే యాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంఘ సభ్యులు కె. జయరావు, రాధాకృష్ణ, జానకిరామ్, సత్యనారాయణ పాల్గొన్నారు.


బిలాయిలో తెలుగు సమాజ్ సభ్యులు

మహిళలకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బిలాయి తెలుగు సమాజ్ ఆధ్వర్యాన సీషా ఫ్రీ టైలరింగ్ శిక్షణ కేంద్రంలో మహిళలకు క్రీడల పోటీలు గురువారం నిర్వహించారు. క్రీడల అనంతరం ఏర్పాటు చేసిన పురస్కార ప్రదానోత్సవంలో సర్వ సమాజ్ కళ్యాణ్ సమితి అధ్యక్షుడు ఇంద్ర సింగ్ మాట్లాడారు. తెలుగు సమాజ్ గత మూడు దశాబ్దాల పేద బాలికలకు, మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని అధ్యక్షుడు బర్రి జోగారావు బృందాన్ని కొనియాడారు. బిలాయి తెలుగు సమాజ్ అధ్యక్షుడు బర్రి జోగారావు మాట్లాడుతూ ఈ శిక్షణ కేంద్రం నుంచి ఇంత వరకు సుమారు మూడువేల మంది శిక్షణ పొందారని, వారి వారి జీవితాల్లో స్థిరపడ్డారని తెలిపారు. సందర్భంగా కవి, రచయిత, సీనియర్ జర్నలిస్టు మడ్డు నాగేశ్వరరావుకు సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్వ సమాజ్ కళ్యాణ్ సమితి ప్రధాన కార్యదర్శి మల్కిక్ సింగ్, కోశాధికారి జోగారావు, ఛత్తీస్గఢ్ తెలుగు మహా సంఘం సలహాదారుడు మొరిపల్లి బాబూరావు పాల్గొన్నారు.

శస్త్రచికిత్స విజయవంతం


శస్త్రచికిత్స చేస్తున్న వైద్యులు

శ్రీకాకుళం సిటీ: ఒడిశా రాష్ట్రం కటక్‌కు చెందిన 75 ఏళ్ల విశ్రాంత నేవీ ఉద్యోగి శ్రీనివాసరావు గత కొన్నేళ్ల నుంచి మోకాళ్ల నొప్పితో బాధ పడుతున్నాడు. ఎన్నో కార్పొరేట్ ఆస్పత్రులు సందర్శించి, చివరకు శ్రీకాకుళం పట్టణంలోని డాక్టర్ లక్ష్మీ నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సప్రదించారు. మోకాళ్ల నొప్పికి వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ వ్యక్తి ప్రస్తుతం నడవ గలుగుతున్నాడు. దీంతో అనందం వ్యక్తం చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండి డాక్టర్ పైల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ రోగికి వయసు పైబడినా, డయోబెటిక్ ఉన్నా అధునాతన టెక్నాలజీ ద్వారా సర్జరీ విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు.

మహిళా సమాఖ్య అధ్యక్షులుగా వసంతాదేవి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


మున్సిపాలిటీ పరిధిలోనిని 15వ వార్డులో వెంకటేశ్వర మహిళా పరపతి సంఘం అధ్యక్షులుగా వసంతాదేవి, వైస్ ప్రెసిడెంట్ లండ జోష్న, కార్యదర్శిగా బొబ్బిలి పుష్ప, సంయుక్త కార్యదర్శి సరితారాణి మహారాణా, కోశాధికారిగా గంటా లతా ఎన్నికయ్యారు. వార్డు ఇన్‌ఛార్జి, పట్టణ టిడిపి కార్యదర్శిగా నందిగాం కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా సంఘాల అబివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిఐ సంతోష్‌కుమార్, రవికుమారి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


ఎన్నికైన మహిళా సంఘు సభ్యులు


నిందితుడిని అరెస్టు చేసిన సిఐ మేరాసాహెబ్

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

మెళియాపుట్టి : మండలంలోని సుందరాడ పంచాయతీ కూర్మన్నపేటకు చెందిన సవర బుడ్డును ఏడు లీటర్ల నాటుసారాతో పట్టుకొని గురువారం అరెస్టు చేసినట్లు టెక్కలి ఎక్సైజ్ సిఐ ఎస్.కె.మేరాసాహెబ్ తెలిపారు. గ్రామంలో గురువారం దాడులు నిర్వహించగా ఆయన వద్ద ఏడు లీటర్ల సారాను పట్టుకున్నట్లు తెలిపారు. నిండితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.


దాతను అభినందిస్తున్న ఎంఇఒ

దాతల సాయం అవసరం

కవిటి: పాఠశాల అభివృద్ధికి దాతల సాయం అవసరమని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. మండలంలోని బార్లపుట్టుగలో ఎంపిపిఎస్ పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కొర్రాయి పద్మనాభం రూ.15 వేలతో ఇనుప స్తంభాలతో రక్షణ కంచె ఏర్పాటు చేసి పాఠశాలకు పటిష్టమైన గేటు ఏర్పాటు చేశారు. పని పూర్తయిన సందర్భంగా గురువారం ఎంఇఒ, పాఠశాల హెచ్ఎం జి.మురళి దాతను అభినందించారు. ఉపాధ్యాయులు కె.జ్యోతి, ఎస్ఎంసి ఛైర్మన్ పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సిక్కోలు లఘు చిత్రోత్సవం లోగో ఆవిష్కరణ

అరసవల్లి: పట్టణానికి చెందిన మణిపాత్రుని క్రియేటివ్ అకాడమీ, పి.కె.ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సిక్కోలు లఘు చిత్రోత్సవం -2025 లోగోను నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు క్రియేటివిటీ టాలెంటను నిరూపించుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశం అన్నారు. ఈ లోగో శ్రీకాకుళం సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు ప్రతిబింబించే విధంగా చిత్రీకరించిన ఆర్ట్ డైరెక్టర్ మణిపాత్రుని నాగేశ్వరరావును అభినందిస్తు ప్రసంశించారు. కార్యక్రమంలో పి.కె.ఎంటర్టైన్మెంట్ నిర్వాహకులు ప్రసాద్, కుమారి, కీర్తి, అభిరామ్, సంజు పాల్గొన్నారు.

విద్యార్థినికి కాంస్య పతకం

ఎచ్చెర్ల: ఖేల్ ఇండియా జాతీయ క్రీడా పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్‌లో డా. బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ క్రీడాకారిణి గుజ్జల వర్షిత కాంస్య పతకం సాధించింది. ఈ నెల 24 నుంచి రాజస్థాన్‌లోని బికనీర్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో మహిళా కేటగిరిలో 69 కేజీల విభాగంలో వర్షితకు ఈ విజయం గురువారం సాయంత్రం వరించింది. జిల్లాలోని శారదా డిగ్రీ కళాశాలకు చెందిన ఈ విద్యార్థిని, డా. బిఆర్ఎయు తరుపున ఈ పోటీల్లో పాల్గొంది. వర్శిటీ క్రీడా కార్యదర్శి డా. ఎం.శ్రీనువాసరావు ఆధ్వర్యంలో వర్షిత ఈ పోటీలకు హాజరైంది. ఈ విజయంపై వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ డా. పి.రవికుమార్‌లు వర్షితకు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ధర్మశాలలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన అఖిల భారత మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కూడా డా. బిఆర్ఎయు తరుపున పాల్గొని రజిత పతకాన్ని వర్షిత గెలుపొందింది.

ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడి

మందస: ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడి సాధించవచ్చునని టిడిపి మండల అధ్యక్షులు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన అన్నారు. మండలంలోని బాలిగాంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రైతు సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మామిడి తాతారావు, భావన ఢిల్లీశ్వరరావు, గున్న విక్రమ్, పొందూరు అశోక్, బెందాళం షణ్ముఖరావు, సాంబమూర్తి, మాదిన శ్రీకాంత్, గున్న ప్రశాంత్, మహంతి పాపారావు, గున్న గోవిందరాజులు, గున్న జయరాం, గున్న రమణమూర్తి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మర్రిపాడు-సిలో నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం పాల్గొన్నారు. అనంతరం అక్కడి రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'అన్నదాతలకు వ్యవసాయం రాష్ట్రానికి బలం, నేనూ రైతు బిడ్డనే, రైతు సమస్యలు నాకు తెలుసు, అందుకే రైతును రాజును చేయడం కూటమి ప్రభుత్వం ధ్యేయం' అని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్య కార్యక్రమాలను సంక్షిప్తంగా వివరించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, మాజీ ఎంపిపి భైరసింగి లక్ష్మీనారాయణ, తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎఒ దాన కర్ణుడు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, ఎఎంసి ఛైర్మన్ ప్రతినిధి బి.దినకర్, మండల గిరిజన సంఘం నాయకులు భైరిసింగి భరణి, సర్పంచ్ రవ్వల అనురాధ, గణపతి రావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలో కీర్తిపురం పాయతారిలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యాన రైతన్న మీ కోసం కార్యక్రమం చేపట్టి రైతులకు అవగాహన కల్పించారు. టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, వ్యవసాయ సహాయ సంచాలకులు భవాని శంకర్, ఎఒ అజయ్‌కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ ఎఒ దూగాన జీవనజ్యోతి, పిఎసిఎస్ డైరెక్టర్ గిన్ని బాలరాజు, లెంక మురళీకృష్ణ, వలపల నరహరి, తులసి, బెహరా, జయలక్ష్మి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోగల బడ్డిపేటలో ఎంపిడిఒ కె.ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యాన రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు.

సోంపేట : మండలంలోని మామిడిపల్లిలో నిర్వహించిన రైతన్న మీకోసంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ప్రతినిధి విజయలక్ష్మి, ప్రతినిధి నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు మడ్డు కుమార్, సూరాడ చంద్రమోహన్, నూకల సోమేశ్, పిఎసిఎస్ అధ్యక్షులు బిన్నాల జగన్నాథం, అగ్రికల్చర్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి, సామాజిక సేవా కార్యకర్త రెయ్య కోదండ కృష్ణ పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని చింతలపేటలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు పాల్గొని రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి నేతింటి జ్యోతి, మార్కెటింగ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ పూజారి శారద, వ్యవసాయ, వెటర్నరీ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : రైతులతో మాట్లాడుతున్న గోవిందరావు

70 మంది విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

శ్రీ శివాని ఇంజనీరింగ్ కళాశాలలో టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు సంస్థ నిర్వహించిన ఆన్‌లైన్ క్యాంపస్ డ్రైవ్‌లో 70 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చిలకాపాలెంలో గల శ్రీ శివాని కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్‌లో బెంగళూరుకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు సంస్థ, ఆన్‌లైన్ క్యాంపస్ డ్రైవ్‌ను రెండు రోజులు నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికలకు కళాశాలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొనగా 70 మంది విద్యార్థులు అన్ని రౌండ్లలో ఉత్తీర్ణులై ఉద్యోగాలు సాధించారు. ఈ ఎంపికలో కళాశాల టిపిఒ డాక్టర్ బి.ప్రసాదరావు, ఎం.శ్రీనివాసరావు నాయుడు, రమాసాయి పర్యవేక్షనలో జరిగాయి. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్య సభ్యులు వి.ఎం.ఎం.సాయినాథ్ రెడ్డి, కె.దుర్గా శ్రీనివాస్, పి.దుర్గాప్రసాద్ రాజు, డి.వెంకటరావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. టి. చంద్రశేఖర్ విద్యార్థులను అభినందించారు.

ఘనంగా 'జెమ్స్' వార్షికోత్సవం


వార్షికోత్సవం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినీహీరో జగపతి బాబు

శ్రీకాకుళం రూరల్ : జిల్లా కేంద్రంలో ఏ ప్రమాదం జరిగిన ముందుగా గుర్తొచ్చేది రాగోలు జెమ్స్ ఆస్పత్రి మాత్రమేనని సినీహీరో జగపతి బాబు అన్నారు. మండలంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి 15వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ జిల్లాకు వచ్చినప్పుడు తాను హీరోగా సినిమా తీసిన నన్ను ఎవరు గుర్తుపట్టలేదని, నేడు నా రాకకోసం ఎంతో మంది ఎదురు చూశారని గుర్తు చేసుకున్నారు. తాను ఎటువంటి సమాజ సేవా చేయలేదని, ప్రజలకు ఎటువంటి సేవ చేసినా అది నా బాధ్యత అని అన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జెమ్స్ ఆస్పత్రి అధినేత బొల్లినేని భాస్కరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సిఎం, మంత్రుల ఫ్లెక్సీకి పాలాభిషేకం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు ఫ్లెక్సీలకు గురువారం పాలాభిషేకం చేశారు. ఎండల మల్లన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 3 కోట్లు విడుదల చేసిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్.ఎల్.నాయుడు, ఎఎంసి చైర్మన్ బగాది శేషగిరిరావు, బడే జగదీష్, దల్లి ప్రసాదురెడ్డి, మామిడి రాము పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ప్రశాంత్‌కుమార్

కొత్తూరు : మెట్టూరు బిట్-2 పంచాయతీలో గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని టిడిపి నాయకులు ఇసాయి ప్రశాంత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు సహకారంతో గ్రంథాలయం స్థలాలను కేటాయించారని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు.



పరామర్శిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

మాజీ మంత్రి పరామర్శ

పలాస: మండలంలోని వీరరామచంద్రపురానికి చెందిన కొంతమంది యువకులు అయ్యప్ప స్వామి మాల ధరించి శబరిమల యాత్ర ముగించుకొని రామేశ్వరానికి వెళ్లారు. మార్గంమధ్యలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, క్షతగాత్రుల కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు గురువారం పరామర్శించారు. ఆయనతో పాటు బమ్మిడి దుర్యోధన, దువ్వాడ రవికుమార్, కె.సంతోష్‌కుమార్, వైసిపి నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

సోంపేట : మండలంలోని మాకన్నపురానికి చెందిన ఉలాల హిమావతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో సమాచారం తెలుసుకున్న కొర్లాంకు చెందిన సంతోషిమాత యువజన సహకార సంఘం సభ్యులు గురువారం రూ.8 వేలు ఆర్థికసాయం మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే మాకన్నపురానికి చెందిన వీర మహిళ చంద్రమ్మ, జన సైనికులు కలిసి రూ.2 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, హరి, సంతోష్, యాదగిరి, మోహనరావు, మనోజ్, రాజు, వంశి పాల్గొన్నారు.

నిరసన విరమించిన హెల్త్ సెక్రటరీలు

శ్రీకాకుళం సిటీ: హెల్త్ సెక్రటరీలకు ఎఎన్‌ఎంలుగా ప్రమోషన్స్ ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో విలేజ్ అండ్ వార్డు హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా గురువారం విరమించారు. ప్రమోషన్లు కల్పించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమానికి మెడికల్ యూనియన్ నాయకులు దేవాది వాసు, సచివాలయం హెల్త్ సెక్రటరీల అధ్యక్షులు డి.ఝాన్సీ, పద్మప్రియ, మాధవి, అరుణ, రమా, చిన్ని, హేమలత, జీవిత తదితరులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న ఎంఇఒలు

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి- కంచిలి

ఎపి పాఠశాల శాసనసభ 25కు ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి ఎంపికై చట్టసభలో చర్చల్లో మండలంలోని ఎం.ఎస్.పల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని ఆరాధ్య పాణిగ్రాహి, గైడ్ టీచర్ సంక రమేష్‌లు గురువారం వచ్చారు. వీరిని పాఠశాలలో అభినందిస్తూ... సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆరాధ్య పాణిగ్రాహిని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తోపాటు ఎపి మోడల్ స్కూళ్ల జాయింట్ డైరెక్టర్ తెహరా సుల్తానా అభినందించడం విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకం అవుతుందన్నారు. తమకు అందుబాటులోని అవకాశాలను అందిపుచ్చుకొని, తమతమ జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంఘికశాస్త్ర ప్రాజెక్టుని అభినందించారు. వీరితో పాటుగా వృత్తివిద్య విభాగంలో ఇటీవల జిల్లాస్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించిన నలుగురు విద్యార్థులను, రాష్ట్రస్థాయి కళ ఉత్సవ్-25 కార్యక్రమంలో పాల్గొన్న ఏపూరి జానకిని సైతం సత్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు శివరాం ప్రసాద్, చిట్టిబాబు, భాస్కర్ పాడి, నల్లాన కృష్ణారావు, ప్రిన్సిపాల్ ఎన్.శివప్రసాద్ పాల్గొన్నారు.

సమానత్వం కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సమానత్వం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎపిఎం గురుగుబెల్లి నారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని కొర్లకోట హైస్కూల్ మైదానంలో జెండర్ క్యాంపైన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ క్యాంపెయిన్ నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమాలు సెర్ఫ్, డిఆర్‌డిఎ ఆదేశాల మేరకు మండల సమాఖ్య మహిళా గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాల స్థాయిలో నిర్వహించబడతాయని, 30 రోజుల పాటు ఈ జెండర్ అవగాహన కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. స్త్రీ, పురుషులు సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన ఆర్థిక వనరులు పొందినప్పుడే లింగ వివక్ష లేని సమాజం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు, మహిళా సంఘ సభ్యులతో సమానత్వ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండల సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి, సిసిలు చందర్రావు, రోజా, లత, పివి రమణ, విఒఎలు పాల్గొన్నారు.



పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఎంపిఎం, మహిళా సంఘాల ప్రతినిధులు

కోడూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పోలాకి

మండలస్థాయి గ్రిగ్స్ క్రీడా పోటీల్లో కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయులు జి.శాంతి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాయమ ఉపాధ్యాయులు తమరాపు రాంబాబు ఆధ్వర్యాన కబడ్డీ సీనియర్స్ బాలురు, బాలికల విభాగం, వాలీబాల్ సీనియర్స్ బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలవడం ఆనందదాయకమని అన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, మోహిని, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరిరావు, శాంతి, హేమలత, జగన్, బాడాన రాజు, వేణుగోపాలరావు, రాజేశ్వరరావు, రఫీ, కళావతి, డోల వసంతరావు, తమరాపు రాంబాబు, సూర్య కుమారి, రమణమ్మ, ధర్మేంద్ర పాల్గొని అభినందించారు.

కష్టపడి చదివితే భవిష్యత్

ప్రజాశక్తి- కొత్తూరు

విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్ ఉంటుందని, ఇటు తల్లిదండ్రులకు, అటు ఉపాధ్యాయులకు పేరు తీసుకు రావాలని విశాఖపట్నం భారతీయ కేంద్రీయ కార్యదర్శి వి.ఆర్. సత్యనారాయణ అన్నారు. స్థానిక విజ్ఞాన భారతి ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో అదనపు భవనాల నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన చేశారు. విశాఖపట్నానికి చెందిన ఫాల్గుణరాజు రూ.40 లక్షలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, స్కూల్ కమిటీ చైర్మన్ లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, డి.వి.రమణమూర్తి, వి.భద్రగిరిరాజు, ప్రిన్సిపాల్ కలమట శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సత్యనారాయణ

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న పిఒ జగన్నాథ్

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-17, 19 రాష్ట్ర క్రీడల్లో ఐటిడిఎ విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో పిఒ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ గురువారం విద్యార్థినులను అభినందించారు. సీతంపేట గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎస్.కావ్య, అండర్-14లో అథ్లెటిక్స్‌లో స్టేట్ సెకండ్ దక్కించుకున్నారు. వీరు డిసెంబర్ 1 నుంచి 4 వరకు మధ్యప్రదేశ్‌లో జరుగు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలో క్రీడల్లో పాల్గొంటారు. సీతంపేట బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఎస్.సమిత ట్రిపుల్ జంప్‌లో స్టేట్ సెకండ్‌కు లభించింది. సిల్వర్ మెడల్ అందుకున్నారు. భామిని ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న ఎస్.కృష్ణవేణి, అండర్-19కు 100 మీటర్లలో స్టేట్ ఫస్ట్ రావడంతో గోల్డ్ మెడల్ అందుకున్నారు. జాతీయ స్థాయికి హర్యానాకు వెళ్లనున్నారు. వీరికి పిఒ అభినందించారు. విద్యార్థినిలతో పాటు హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్, పీడీ బి.శైలజ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గోవిందరాజులు

మంత్రికి అభినందనలు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కళింగ వైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 2014-19లో మంత్రిగా ఉన్న సందర్భంలో ఇదే ఆలయానికి రూ.3 కోట్లు విడుదల చేశారని, ఇప్పుడు మళ్లీ నిధులు మంజూరు చేశారని అన్నారు. గతేడాది నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు రాష్ట్ర పండగలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో బాణసంచా కాల్చి పండగ వాతావరణం కల్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కోరాడ గోవిందరావు, ఆలయ కార్యనిర్వహక అధికారి వాకచర్ల రాధాకృష్ణ, అయ్యప్పస్వామి ఆలయ ధర్మకర్త తంగుడు కృష్ణస్వామి, మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రిమ్మ పాల్గొన్నారు.



నాదస్వర విన్యాసం

అలరించిన నాదస్వరం

ప్రజాశక్తి- అరసవల్లి

ఆరామ ద్రావిడ సంఘం, శ్రీ సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో ఇప్పిలి జోగారావు 102వ జయంతి వేడుకలు సందర్భంగా రెండవ రోజు గురువారం కేరళకు చెందిన ఆర్.కన్నన్, ఆనంద్‌ల నాదస్వర విన్యాసం కార్యక్రమం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. నాదస్వర విన్యాసంలో డోలు వాయిద్య సహకారం మెట్టుపల్లి రవి, వి.ఎం.గణేష్‌లు వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా నాదస్వర కళాకారుడు రాళ్ళపాటి అచ్చెన్నకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, గుమ్మా నగేష్, ఇప్పిలి శంకర్‌శర్మ, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు, గోవిందరాజులు శర్మ, అంపోలు రుద్ర కోటేశ్వరశర్మ, సురంగి మోహనరావు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

పొందూరు: ఒకరి అవయవదానంతో మరో ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు ప్రసాదించ వచ్చునని రోటేరియన్ సప్పటి వసంతరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్టు, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ అవయవదాన దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లాబ్ టెక్నిషియన్స్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, విద్యార్థులకు కిడ్నీ, గుండె, లివర్, ఊపిరితిత్తులు, కళ్లు వంటి పలు అవయవాల దానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.ఇందిర, అధ్యాపకులు పాపారావు, రాజేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వసంతరావు